గురువు

కేంపు నుంచి అప్పుడే వచ్చాడు రమణరావు.

టీ కప్పుతోబాటు అతడి కొచ్చిన మెయిల్ అందిచ్చింది భార్య.

అతడు మెడికల్ రిప్రజెంటేటివ్. కంపెనీ నుండి డిస్ట్రిబ్యూటర్ల నుంచీ ఎన్నో ఉత్తరాలొస్తుంటాయి. అరేత కేంపు నుంచి రాగానే ముందు వాటిని పరిశీలించడం అతడి అలవాటు.

"మొన్ననేదో శుభలేఖ వచ్చిందండీ"

"ఎక్కడ్నుంచీ"

"అమలాపురం నుంచి....కార్డు ఎక్కడ పెట్టేరో పిల్లలు...."

"చూడు చూడు. అలాటి ముఖ్యమైన లెటర్స్ అక్కడా ఇక్కడా పెడితే ఎలాగా" విసుక్కొన్నట్టుగా అన్నాడు.

"అమలాపురాన్ని నాకు తెలీని బంధువులెవరున్నారండీ"

"సవాలక్ష మంది వుంటారు. కబుర్లు కట్టిపెట్టి అదెక్కడ పెట్టావో చూడు ముందు"

"ఇదిగో టీవీ మీద పెట్టారు...." తెచ్చిచ్చింది.

చూస్తోన్న లెటర్స్‌ని ప్రక్కన పెట్టి శుభలేఖ అందుకున్నాడు.

అమలాపురం అన్న పేరు చెవినబడినప్పట్నుంచీ అతడి మనస్సు మనస్సులో లేదు మరి.

విఠల్ పెళ్లి అతడు రమణరావుతోబాటు రిప్రజెంటేటివ్‌గా పనిచేశాడు. తర్వాత రిజైన్ చేసి స్వంత ఊళ్ళో బిజినెస్ ప్రారంభించాడు.

ఇద్దరి మధ్యా పెళ్లికి వెళ్ళితీరాల్సినంత స్నేహమేమీలేదు.

అయినా పెళ్లికి వెళ్లాలని వెంటనే నిశ్చయించేసుకున్నాడు రమణరావు. నిజానికా ప్రాంతానికి వెళ్ళే ఛాన్స్ కోసం చాన్నాళ్ళ నుంచి ఎదురు చూస్తున్నాడతడు.

విఠలూ అతని మిత్రబృందమూ సరదా పురుషులని తెలుసు. మండపాక నుంచో రాజోలు నుంచో భోగం వాళ్ళని రప్పించి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తారనీ తెలుసు. అందుకోసమే వెళ్ళాలని ఉవ్విళ్ళూరుతున్నాడు.

"అబ్బో-వీడు నా క్లోజ్ ఫ్రెండ్. పెళ్లికి వెళ్ళి తీరాల్సిందే. లేకపోతే చాలా బాధ పడతాడు"

"క్లోజ్ ఫ్రండా! ఎప్పుడూ పేరైనా విన్నట్టు లేదు...."

"నీకు తెలీదులే. హైస్కూల్లో కలిసి చదివేం. పెళ్ళి రేపేనే. అబ్బో త్వరగా పనులు తెముల్చుకోవాలి"

అతడి చదువంతా విజయవాడలోనే సాగింది. ఆ ఫ్రండ్‌ది అమలాపురం గనుక విజయవాడ స్కూల్లో చదివే అవకాశం వుండదు. మరైతే ఎందుకు అబద్ధం చెబుతున్నట్టు?

ఆమె అతడ్ని అదోలా చూసి లోపలికి వెళ్లిపోయింది.

ఆ చూపులోని ములుకు ఎక్కడో గుచ్చుకుంది.

అయినా లక్ష్యపెట్టలేదు రమణరావు. కొత్త అనుభవం కోసం అప్పుడే అతడి అణువణువూ ఉరకలు వేస్తోంది మరి!

సన్నగా ఈలవేస్తూ హుషారుగా ప్రయాణపు ఏర్పాట్లు చేసుకుంటున్న భర్తని అదోలా చూసింది తప్ప పల్లెత్తు మాటన్లేదామె. కేంపు నుంచి రాగానే ఎంత ముఖ్యమైన పనివున్నా మళ్ళీ ప్రయాణం కాడతడు. అలాటిదిప్పుడు ఎగిరి గంతేసి వెళ్తున్నాడు. కారణం ఏమైవుంటుందో వూహించలేనంత అమాయకురాలు కాదామె.

నిట్టూర్చి తన పనిలో పడిందామె.

"డాడీ నాకేం తెస్తావ్" పదేళ్ళ కూతురడిగింది.

"నీకా? నీకు.....ఆఁ...అక్కడీమధ్య స్మగుల్డ్ గూడ్స్ బాగా దొరుకుతున్నాయిలే. గల్ఫ్ దేశాలకి ఆ ప్రాంతం వాళ్ళు చాలా మంది వెళ్ళారు. వాళ్ళు ఎలక్ట్రానిక్స్ గూడ్సులవీ తెచ్చి చవకగా అమ్మేస్తుంటారు. మనం ఎప్పట్నుంచో టేప్ రికార్డర్ కొందామనుకుంటున్నాం కదా. అది కొని తెస్తాను. సరేనా?"

"నాకే ఇచ్చెయ్యాలి మరి"

"ఓకే-డన్"

"పెళ్లవ్వగానే బయల్దేరి వస్తే బాగుండదు. ఫ్రెండ్స్‌మి అంతా కలుస్తాం కదా. సరదాగా రెండు మూడు రోజులు ఎంజాయ్ చేసొస్తాను. నీకు తెలీదు గాని కోనసీమ బ్యూటిఫుల్ ప్లేస్" బయల్దేరుతూ అన్నాడు.

ఆమె జవాబివ్వలేదు. అతడు ఆశించనూలేదు. ఆమె ఏదో అనుకుంటుందని అతడనుకుంటూ అది సరికాదని సర్దిచెప్పడానికన్నాడంతే.

అమలాపురం బస్సెక్కి కూర్చునీ కూర్చోగానే ఉద్యోగమూ భార్యా సంసారమూ పిల్లలూ సమస్తమూ మర్చిపోయాడు రమణరావు.

ఇన్నాళ్ళకి కోనసీమ వెళ్ళే అవకాశం వెదుక్కుంటూ వచ్చింది. తన గురించీ తన అభిరుచుల గురించీ తెలిసిన విఠల్ చక్కని ఏర్పాట్లు చేసే వుంటాడు. ఒకవేళ ఏ కారణం చేతనైనా చెయ్యకపోతే తనే చేయిస్తాడు.

శృంగార రసాధి దేవతలని పేర్కొంచిన భోగపు పడుచుల పొందులో తనివితీరా కరిగిపోతాడు. వాత్స్యాయన కామసూత్రాలకి సరైన భాష్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటాడు.

ఓహ్! వాటె లక్కీ ఛాన్స్!

ఊహల్లో ఊరేగుతూ వేడికోర్కెల కౌగిళ్ళలో కరిగిపోతూ ఊపిరాడని అనుభూతుల్తో వుక్కిరిబిక్కిరి అయ్యాడు.

రమణరావుని చూసి మహదానందంతో ఆహ్వానించాడు విఠల్.

పెళ్లికి ఆతడొస్తాడని ఏమాత్రం ఊహించలేదు వృత్తిరీత్యా అయిన కొద్దిపాటి స్నేహాన్ని పురస్కరించుకుని ఎంతో దూరాన్నుంచి ఎంతో అభిమానంతో ప్రత్యేకంగా వచ్చేసరికి అతడికెంతో ఆనందంగా గర్వంగా అన్పించింది.

"నా రియల్ ఫ్రండ్. మాంచి రసికుడు" అంటూ తన మిత్ర బృందానికి పరిచయం చేశాడు విఠల్.

"భలే కంపెనీ దొరికిందైతే. విఠల్ పెళ్లిరోజుని మరపురానిదిగా చేసుకుందాం సార్" ఒకడన్నాడు.

"స్మగుల్డ్ గూడ్స్ ఏమైనా దొరుకుతాయా? టేప్ రికార్డర్ కొనాల్రా. ఎవరైనా తెలిసిన వాళ్ళ ద్వారా వాకబు చెయ్యి" విఠల్‌కి చెప్పాడు.

విఠల్ ఫ్రండ్సంతా కలిసి రమణరావుని గోదావరి ఒడ్డున తిప్పారు. కొబ్బరితోటల్లో కొబ్బరి బొండాల నీళ్ళు తాగిపించారు. పల్లెపదాలు వినిపించారు. పచ్చని ప్రకృతి విశ్వరూపాన్ని చూపించారు. ఏఏ సినిమాల్లోని ఏయే దృశ్యాలు ఎక్కడెక్కడ తీశారో ఏకరువు పెట్టారు. బోటు షికార్లు చేయించారు. ఊరంతా తిప్పారు. సినిమాలకొచ్చిన ఆడవాళ్ళ అందాలని చూపించారు. చీప్ కామెంట్స్ చేస్తూ సంతోష పెట్టారు.

అన్నీ తిరిగి వచ్చేసరికి ఒకావిడ టూ ఇన్ వన్ పట్టుకొని వారికోసమే ఎదురు చూస్తూ కూర్చుంది ఆవిడకి ముప్పయ్ ఏళ్ళుంటాయ్. నల్లగా మోటుగా బలంగా వుంది. నీలం రంగు ఫారెన్ చీర కట్టుకుంది. నల్లకళ్ళజోడు పెట్టుకుంది. అర్థణా మందాన పొడరు పులుముకుంది. చేతులకి బంగారు గాజులున్నాయి. మెడలో డాలర్ గొలుసుంది. మొత్తానికి ఎబ్బెట్టుగా వున్నా స్టయిలు వెలగబెడుతోంది.

రమణరావుకి టూ ఇన్ వన్ చూపించాడు విఠల్. లోపలేదో కేసెట్ కూడా వుంది.

"అంతా చెక్ చేశాంరా. బాగుంది. రేటు కూడా ఫర్లేదు"

"ఓకే డెన్. తీసేసేకుంటాను" డబ్బిచ్చేశాడు.

ఎత్తుమడమల జోడుతో నడవలేక అవస్థపడుతూనే స్టయిలు ప్రదర్శిస్తూ వెళ్ళిపోయిందావిడ.

"ఏమిటి అటే చూస్తున్నావ్? ఓ చూపు చూస్తానంటే చెప్పు ఫ్రీగా వచ్చేస్తుంది. మన్లాంటి కుర్రాళ్ళంటే స్పెషల్ లైకింగ్ లే"

"ఇలాటి వారికోసం ఇంత దూరం రావాలా?"

మనస్సులోని మాటని అన్యాపదేశంగా బయటపెట్టేడు రమణరావు.

"భలేగా చెప్పేరు గురూగారు. గురూగారి టేస్ట్ తెలుసుకున్నాం. ఒకర్ని మండపాక పంపేంలే. గురూగారి సంగతి మాకొదిలేయ్" ఓ ఫ్రెండ్ అన్నాడు విఠల్‌తో.

"స్పెషల్ ప్రోగ్రాం ఖర్చంతా నీదేనోయ్" మరొకడన్నాడు.

"అలాగే కానివ్వండి. కాని పెళ్లయ్యేవరకూ పెళ్ళిపందిట్లోంచి కదలకూడదు"

"వాకే" నాగార్జునని ఇమిటేట్ చేస్తూ అన్నాడొకడు.

నవ్వేరు మిగతావాళ్ళు.

సందకాడి ముహూర్తం గనుక భోజన కార్యక్రమం మొదలైంది.

మిత్రులంతా భోంచేసి కళ్యాణ మంటపానికెళ్ళారు. పెళ్లి తతంగం మొదలయ్యింది. అటూ ఇటూ తిరుగుతూ ఆడవాళ్ళని తినేశాలా చూస్తూ ఓ గంట గడిపారు. వెళ్దామంటే వెళ్దామనుకుని అక్కడ్నుంచి వచ్చేశారు.

కొబ్బరితోటలో మందుపూజలో కూర్చున్నారు రమణరావూ విఠల్ మిత్రబృందమూ.

'మధువుకి ఈ తోట బాగానే వుంది. కాని మగువకి ఇక్కడేం బావుంటుందీ' అనుకుంటూ అయిష్టంగా ఇబ్బందిగా కూర్చున్నాడు రమణరావు.

హోటల్ సౌకర్యాలు లేకపోతే మానె పట్టెమంచమూ పడకగదీ లేకపోతే ఎలాగా అని దిక్కులు చూస్తోంటే దగ్గర్లోని పాకలో మడత మంచాలు కన్పించాయి. పెట్రోమాక్స్ లైటు కూడా వెలుగుతోంది.

అతడికేవిటోగా చేదుగా అన్పించింది.

ఎంతో గొప్పగా నభూతో నభవిష్యతిగా వుంటుందనుకున్న అనుభవం చప్పగా చల్లగా వుంటుందనుకుంటూ నీరుకారిపోయాడు.

"గురూగారు దిక్కులు చూస్తున్నారేంటి కథ? వస్తాయి చిలకలు చేస్తాయి రంజుగా డాన్సు. తీసుకెళ్తాయి స్వర్గానికి" మూడో రౌండ్‌లోనే కవిత్వం మొదలెట్టేశాడొకడు.

"తింటున్నా తాగుతున్నా మజాగా లేదొరేయ్. మాల్గాడి శుభ పాటల్ని పెట్టండ్రా"

"ఆ కేసెట్టు ఇంట్లోవుంది. గురూగారి టేప్ రికార్డర్ని తెచ్చేం. అందులో ఏదో కేసెట్ వుంది. పెట్టనా"

"ఇంకా చూస్తావేంరా పెట్టు. బంగారు కోడిపెట్ట....." పాటందుకున్నాడు.

రికార్డల్లోంచి ఏవో మాటలొస్తున్నాయి. ఒక్క నిముషానికే అదేమిటో అర్థమైపోయింది, ఎగిరి గంతేశారు.

"కువైట్‌లో వుంటున్నావాడు పెళ్లానికి పంపిన కేసెట్ లేఖరా. మొదట్నుంచీ పెడతాన్రా. పెళ్లానికి ఏం రాశాడో విందామొరేయ్" ఉత్సాహంగా ఫార్వర్డ్ చేశాడు.

కేసెట్ మొదలైంది.

అంతా ఉత్సుకతతో చెవులు రిక్కించారు.

"పార్వతీ!

నేనిక్కడ బాగానే వున్నాను. నువ్వూ పిల్లలూ నాయనా అంతా బాగున్నారని మొన్న ఇండియా నుంచొచ్చిన అప్పారావు చెప్పేడు. పిల్లల్ని బాగా చదువుకోమను.

ఒరే బాబూ! బాగా చదువుకోరా! నాలాగా చదువూ చట్టుబండలూ లేకుండా వుండొద్దొరే. చదువులేనోడు ఎందుకూ పనికిరాడురా. చదువు రాకే ఇదిగో ఇలా కేసెట్లో మాట్లాడి మీకు పంపిస్తున్నాను. లేకపోతే ఉత్తరాలు రాసేవోడ్ని. చదువు నాకూ రాదు. మీ అమ్మకీ రాదు. పొట్టచించినా అచ్చరం ముక్క లేదు గనుకే మీ అందర్నీ మనూర్నీ ఒదిలేసి ఇంత దూరం ఒచ్చేను. లేపోతే అక్కడే హాయిగా వుండేటోళ్ళం. అంతా కలిసుండేవోళ్ళం. బాగా చదువుకోరొరేయ్.

పార్వతీ! మా నాయన్ని సరిగ్గా చూట్టంలేదని అప్పారావు చెప్పినకాడ్నుంచీ ఏడుపొత్తాంది. ముసలోడు ఎంతో కాలం బతకడే. ఆడ్ని సంటి పిల్లాళ్ళా చూసుకోవే. జాగర్తగా చూసుకోవే. ఆడు నా తండ్రి. నీ మావ. గుర్తెట్టుకోవే.

మొన్న చిన్నగొడవలో పోలీసులు డ్రైవింగు లైసెన్సు లాగేసుకున్నారు. కొట్లో పడేశారు. రెండ్రోజులు జైల్లో నానా బాధలూ పడ్డాను. బయటికి రావడానికి చాలా ఖర్చయ్యింది. అన్నాళ్ళకీ మా నవాబు జీతం కోసేశాడు. చాలా కోపంగున్నాడు.

ఏంటోనే. ఇక్కడ ఉండలేకపోతన్నానే. ఇండియా వచ్చెయ్యాలన్పిస్తోందే. నువ్వేమో ఇంకా అది కొనాల ఇది కొనాల అంటున్నావ్. మీ అందర్నీ చూసి రెండేళ్లయిపోతాందే. ఓపాలి వద్దామంటే బోల్డు ఖర్చు. ఆ డబ్బు పంపిస్తే ఏదోటి కొంటావని ఇండియా రాకుండా నీకు పంపేస్తున్నాను. నువ్వేం చేస్తన్నావో ఏంటో ఏమీ తెల్డం లేదు.

ఇప్పటికప్పుడే ఎనభైవేల దాకా పంపేను. పొలం ఇంకా రిజిస్టరీ అవ్వలేదంటేంటే. డబ్బేం జేత్తన్నారే.

డబ్బు ఇంకా పంపు ఇంకా పంపు అంటే ఎక్కడ్నుంచి తేనే? ఇక్కడ డబ్బు చెట్లుకి కాయదే. ఇక్కడ నీళ్ళు కూడా కొనుక్కోవాలి. తెల్సా? ఎక్కడో అక్కడ పదివేలు అప్పుజేసి రిజిస్టరీ చేయించెయ్. ఒకటి రెండు నెలల్లో పంపిస్తా తీర్చేద్దువుగాని. అర్థమైందా?

ఈ మద్దెన నాకు ఒంట్లో బాగోటంనేదే. రాత్రుళ్ళు చలొస్తోంది. దగ్గు వత్తాంది. ఏంటో ఏదీ కల్సి రావట్లేదనుకో. అసలిదంతా నీ వల్లే వచ్చింది. ఎప్పట్నుంచో ఇంట్లో వుంటున్నాయి మేకలు. ఆటి బాగోగులు చూళ్ళేక అమ్మేసినావ్. అప్పట్నుంచీ ఏ పనీ అవ్వటం లేదు. ఎవళ్ళకీ బాగోటం లేదు. శని పట్టుకున్నట్టుందనుకో. మేకలు మా తాతముత్తాతల కాలం నుంచీ వున్నాయ్. ఆటిని అమ్మేశావ్. ముసలోడు మొత్తుకున్నా నువ్వు ఇన్లేదు. అందుకేనే మనకీ కష్టాలన్నీ. వెంటనే రెండు మేకల్ని కొనెయ్యవే. వింటున్నావా. డబ్బు లేదని వంక పెట్టకు. అప్పోసప్పో చేసి కొనెయ్. ఈ పాలి ఇండియానుంచొచ్చినోళ్ళు మీ ఆవిడ మేకల్ని కొందిరా మీ అయ్యని బాగా సూత్తాందిరా అని చెప్పాల.

పార్వతీ! నీతో ఓ ఇసయం మాటాడాల. పిల్లల్ని దూరంగా ఎల్లిపోమను. ఇన్నా పర్లేదనుకో. మా అమ్మ ఇలాటిదా అని ఇద్దైపోతారేమో ఎల్లిపోమనవే.

ఈ మద్దెన నీ ప్రవర్తనేవీ బాగోటంలేదని ఆళ్ళూ ఈళ్ళూ రాస్తున్నారు. ఇండియా నుంచొచ్చి నోళ్ళు చెబుతున్నారు. నీకేం లోటు చేత్తన్నానని ఇలా చేత్తనావే? నాలుగు

రాళ్ళు సంపాయించడానికి ఇక్కడికొచ్చానుగాని యాకంగా ఇక్కడే వుండి పోతానను కున్నావేంటే. మగాడు లేకుండా రెండేళ్ళు వుండలేవేంటే. అలాగైతే అక్కడే వుండిపోదును కదేంటే. ఆళ్ళెళతన్నారు ఈళ్ళెళతన్నారు నువ్వూ ఎళ్ళు డబ్బు నొల్లుకురా అని తోసింది నువ్వేకదేంటే. నేనొచ్చేక నాఎనకాల ఎధవ తిరుగుళ్ళు తిరుగుతావా? నీకిదేవన్నా బాగుందా?

ఇక్కడ బోల్డు దేశాలోళ్ళున్నారు. అయిదారేళ్ళగా ఇంటి కెళ్ళనోళ్ళున్నారు. ఆళ్ళ పెళ్ళాలంతా నీలాగే తిరుగుతున్నారా? అంతెందుకే. వయస్సులో వుండి పెళ్లి కానోళ్ళూ మొగుడు చచ్చినోళ్ళూ మనూళ్ళో ఎంతమంది లేరే. ఆళ్ళంతా నీలాగే పరువు తక్కువగా తిరుగుతున్నారా?

థూ ఎధవ జనమ! మనిసై పుట్టేక నీతీ రీతీ వుండాలే. మనం జంతువులం కాదే. వుప్పూ కారం తింటున్నామని మదమెక్కి రెచ్చిపోతే భగవంతుడు కూడా చమించడే.

నిన్ను తిన్నగా వుండమంటున్నాడని అడ్డమైన తిరుగుళ్ళు తిరగొద్దంటున్నాడనే కదేంటే మా అయ్యని మాడ్చేత్తన్నావ్? చెప్పవేమే. నిన్ను చూసి వూళ్ళోవాళ్ళేమనుకుంటారే? నా పరువేం కావాలే? వంశం ఏం కావాలే? ఫలానావోడు కువైట్లో కట్టపడి సంపాదిస్తావుంటే ఆడి పెళ్లాం నదురుగా కన్పించినోడి కల్లా పక్కపరుత్తోందని అంతా అనుకుంటే ఎంత సిగ్గు! ఎంత నామోసీ! మానవ పుట్టుక పుట్టేక సిత్తకార్తె కుక్కల్లెక్కన వుండకూడదే.

నీలాగే నేను మాత్రం ఇక్కడ తిరగలేనా? ఆళ్ళెంట ఈళ్ళెంట పోలేనా? సెప్పవేమే. అప్పుడ్నీకు డబ్బు పంపకుండా అంతా నేనే జల్సాచెయ్యొచ్చు కదేంటే. అలా చెయ్యకుండా కడుపు మాడ్చుకుని కూడబెట్టి నీకెందుకు పంపుతున్నానే? అసలిన్నివేల మైళ్ళ దూరం ఎందుకొచ్చానే? డబ్బు సంపాయించి పెళ్లాన్నీ బిడ్డల్నీ సుకపెట్టాలనే కదా. మాటాడవేమే? మీ అందరికోసం నేనిక్కడ రెక్కలు ముక్కలు సేసుకుంటావుంటే నువ్వక్కడ కులుకుతూ నా బతుకు నవ్వుల పాల్జేత్తావా?

నువ్వట్టా తిరుగుతున్నావు ఇట్టా తిరుగుతున్నావు మందలించరా అంటే కిట్టనోళ్ళు ఆని సరిపెట్టుకున్నానుగాని నిన్ననుమానించలేదు. అప్పారావే కాదు మన రాజోలు దగ్గర్నుంచొచ్చినోళ్ళంతా చెప్పేసరికి నా పేణం వుడికి చచ్చిపోయిందే. అప్పట్నుంచి ఎంత ఇదైపోతన్నానో సెప్పలేనే. ఒక్కోపాలి విషం మింగి సద్దామనిపిత్తోందంటే నమ్ము. అసల్నే నీకు అక్కర్లేకపోతే అప్పుడెప్పుడో వచ్చినప్పుడు ఇంత విషం ఇచ్చి చంపెయ్యక పోయావేంటే. అప్పుడ్నీకు అడ్డూ ఒడ్డూ వుండేవి కాదుకదే.

ఇదిగో పార్వతీ. ఇప్పటికైనా లెంపలేసుకుని బుద్ధిగా వుంటే వుండు. లేపోతే నీదారి నువ్వు చూసుకో. ఈ కత్తికోత నేను భరించలేను. అయ్యా! అమ్మ మంచిది కాదని పిల్లలు సెబితే నేను మనిషిగా వుండను. నిన్ను చంపి జైలుకెళ్తాను.

అసలు పెళ్ళంటే ఏంటే? ఇద్దరు కలిసుండాలి. కట్టవొచ్చినా సుకమొచ్చినా కలి సుండాలి. వయసున్నా వుడిగినా కలిసుండాలి. మొగుడి మీద పెళ్లానికీ పెళ్లాం మీద మొగిడికీ ప్రేమ వుండాల. నమ్మకం వుండాల. ఆ నమ్మకం చెదిరిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యతుండాల. అప్పుడే ఆ పెళ్లీ ఆ బంధం గట్టిగా నూరేళ్ళపాటుంటాయి. అవి లేకపోతే అంతా దొంగ బతుకైపోద్ది. దొంగ కాపురమైపోద్ది. దొంగ పెళ్ళయిపోద్ది!

నా మాటల్నీకు విషం లాగుంటాయని తెల్సు. అయినా మన పిల్లల కోసం చెబుతున్నావే. ఒసే పార్వతీ! వయసెప్పుడూ వుండదే. ఇంకో పదేళ్ళకి ముసలమ్మవైపోతావ్. పరువూ మర్యాదా లేకపోతే అప్పుడ్నిన్నెవ్వరూ చూడరు. ప్రేమగా మాటాడరు. 'థూ లం..!' అని వూసేత్తారు. అప్పుడ్నీబతుకు గోదారేనే!

లోకంలో దూరదేశాలెల్లేది నేనొక్కడ్నే కాదే. బోల్డు మందెళ్తన్నారు. ఎన్నోవూళ్ళ కెళ్తన్నారు. ఎక్కడెక్కడికో వుజ్జోగాల మీదెళ్తన్నారు. ఎందుకు? డబ్బు సంపాయించి నమ్మినోళ్ళని సుఖపెట్టాలని. ఆళ్ళక్కడ మనశ్శాంతిగా వుండాలంటే గుండెల్లో ప్రేమ పెరగాలంటే ఇంట్లో ఆడది ఆడి పెళ్లాంగా వుండాలి. ఆడి పిల్లల తల్లిగా వుండాలి. అంతేగాని మరొకడి ముండలా వుండకూడదు. కులక్కూడదు. ఆడదే కాదు మగాడైనా అంతేనే. పెళ్లాం పక్కన లేదుకదాని ఎవరెవర్తోనో ఎళ్ళేవోడు కూడా నా దృష్టిలో ఎదవ్వే. ఎంగిలికుక్కే.

అసల్నీకేం లోటు చేశానే పార్వతీ? బట్టలిచ్చాను. ఇల్లిచ్చాను. పేరిచ్చాను. పరువిచ్చాను. నగలిచ్చాను. డబ్బిచ్చాను. ఇప్పుడు పొలం కూడా ఇచ్చాను. పిల్లల్నిచ్చాను. పదేళ్ళు సంసారం చేశాను. ఇల్లిప్పుడు రెండేళ్ళు లేనని వూరిమీద పడతావా? ఇంతన్యాయం చేత్తే యముడోడు వూరుకోడే. కాలిన వూసల్తో పొడుస్తాడు. కాగిన నూనెలో వేపుతాడు. ఛీ-నీ వేషాలు తల్సుకుంటే ఒళ్ళంతా కాలిపోతోందే. గుండెలు రగిలిపోతున్నాయే.

ఆఖరి మాట సెబుతున్నా. వుంటే నన్నే నమ్ముకునుండు. లేదా అన్నీ వొదిలేసి నీ దారిన నువ్వు ఫో. మళ్ళీ నీ మొఖం నాకూ నా పిల్లలకీ సూపించమాకు. నువ్వు సచ్చిపోయామనుకుంటామే....."

ఆ తర్వాత సన్నగా ఏడుపు విన్పించింది.

కొన్ని క్షణాల వరకూ ఎవరూ మాట్లాడలేకపోయారు – ఎందుకో అందరిగుండెలూ బరువెక్కినట్టుగా అన్పించాయి.

"అబ్బో – చాలా వేదాంతం వల్లించాడే. ఆ పెళ్లాం ఆ కేసెట్ పూర్తిగా వినకుండానే కేసెట్‌తో సహా అమ్మేసింది చూడు. సిగ్గులేనిజన్మ!"

కమ్మీతో చెళ్ళున కొట్టినట్టు ఫీలయ్యాడు రమణరావు.

చదువూ సంధ్యాలేని ఒక ప్రవాస భారతీయుడు తన భార్యనుద్దేశించి మాట్లాడినట్టుగా గాక నీతి తప్పిన ఆడా మగా అందర్నీ వుద్దేశించి మాట్లాడినట్టుగా అన్పించింది.

అతడి యెడ ఆమె ప్రవర్తనకీ, భార్యయెడ తన ప్రవర్తనకీ తేడా ఏమీ లేదు. అతడు తిట్టినతిట్లూ చేసిన వ్యాఖ్యలూ హెచ్చరికలూ అన్నీ తనకి అక్షరాలా వర్తిస్తాయి!

జీవితంలో సెక్స్ ముఖ్యమైనదే – కానదే జీవితం కాదు.

సెక్స్ సుఖం అన్నది కండరాల కదలికలోగాక మనస్సు స్పందనలో వుందన్నది ఇంత అనుభవంతో కూడా తను గ్రహించలేకపోవడం అమాయకత్వం కాదు గుడ్డితనం. ఇంకా కళ్ళు తెరవకపోవటం అమానుషత్వం!

"ఏమిటలా అయిపోయారు గురూ గారూ. వాడి సొద వినా చిలకలు రాలేదనా? మీరు కోరిన పంచ వన్నెల రామచిలుకలు అవిగో వచ్చేస్తున్నాయి"

"సారీ. నేను అర్జంటుగా మావూరెళ్ళిపోవాలి. ఇప్పుడేమైనా బస్సు దొరుకుతుందా?"

మందు ముందు నుంచి లేచి దృఢస్వరంతో అన్నాడు రమణరావు.

కొత్తగా కన్పిస్తోన్న అతడ్ని వింతగా చూస్తూండి పోయారంతా.

(ఆంధ్రభూమి వారపత్రిక 27.1.94)